సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం ၊ 21 ၊ ఆగస్టు ၊ 2024



సోమశిలలో 25.8 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 25.8 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 11455 క్యూసెక్కులు వస్తున్నాయి. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,220
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,709
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,910
సవర (8 గ్రాములు)	రూ.55,280

గరిష్టం/కనిష్టం
37.1 /28.9

వాతావరణం

గాలిలో తేమ 70 శాతంగా మంగళవారం నమోదైంది. జిల్లాలో వాతావరణం బుధవారం పొడిగా ఉంటుందని ఆ శాఖాధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

సమ్మె కొనసాగిస్తాం.. ఉధృతం చేస్తాం



నెల్లూరు (అర్బన్): కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కళాశాలలో పీజీ చేస్తున్న ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని, డాక్టర్లపై దాడులను అరికట్టే విధంగా రక్షణ చట్టాలను అమలు చేయాలని, అలా చేయని పక్షంలో వైద్యసేవలు నిలిపేసి సమ్మెను కొనసాగిస్తామని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. నగరంలోని జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మె, ధర్నా మంగళవారం నాటికి ఆరోరోజుకు చేరుకుంది. డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్లకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అన్ని కళాశాలల విద్యార్థులు, విద్యార్థి సంఘాల మద్దతు తీసుకుని పోరాటం ఉధృతం చేస్తామన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లు పలువురు మద్దతు తెలిపారు.

కొవ్వొత్తులతో నిరసన పాస్టర్స్



నెల్లూరు (బృందావనం): కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ట్రంకురోడ్డు గాంధీబొమ్మ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అసోసియేషన్ జాతీయ సమన్వయకర్త ఎ.జయప్రకాష్, వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, రాష్ట్ర అధ్యక్షుడు ఐఎస్ బెన్హర్‌బాబు మాట్లాడుతూ ఈ ఘటన అమానవీయమన్నారు. మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కఠినతరం చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏసురత్నం, ఉపాధ్యక్షుడు కేవీస్ రాజు, ప్రధానకార్యదర్శి రమేష్, కోశాధికారి కిషోర్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా, సహాయ కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్, క్రిస్టియన్ యూత్ నేత రాజేష్ పాల్గొన్నారు.

743 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 743 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 892 బేళ్లు వచ్చాయన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించామన్నారు. వేలంలో 95,916.5 కిలోలు విక్రయించామన్నారు. కిలోకు గరిష్టంగా రూ.358, కనిష్టంగా రూ.204 ధర లభించగా. సగటున రూ.298.08 లభించింది. వేలంలో 14 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక చక్రం అష్టదిగ్బంధం

- జగనే సీఎంగా ఉండి ఉంటే.. సంతోషాల హరివిల్లు
- ఐదు నెలల్లో 18 పథకాల ద్వారా అందాల్సిన లబ్ధి
- పేద, మధ్య తరగతి ప్రజలకు అందని సంక్షేమ ఫలాలు
- స్తంభించిన వ్యాపార లావాదేవీలు
- వాణిజ్య రంగం కుదేలు

రూ.1,406.04 కోట్లు నష్టపోయిన జిల్లా ప్రజలు

జిల్లాలో ఆర్థిక చక్రం అష్టదిగ్బంధంలో చిక్కుకుంది. పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లల్లో ఆనందాలు, సంతోషాలు ఆవిరైపోయాయి. అప్పుల కష్టాలు వెంటాడుతుండడంతో కళ్లల్లో కళ తప్పింది. గడిచిన ఐదు నెలల్లో ప్రజలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు చేతికందడం లేదు. కొనుగోలు శక్తిలేక జిల్లాలో వ్యాపారం స్తంభించింది. టర్నోవర్ తల్లకిందులైంది. బిడ్డలను చదివించేందుకు తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారు. రైతులు కాడి వదిలేశారు. నేతన్న మగ్గం పనులకు పెట్టుబడి కోసం షావుకారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. వేట సాగక, సాయం అందక మత్స్యకారులు అప్పుల కోసం పెట్టుబడిదారులను బతిమాలుకుంటున్నారు. ఫీజులు చెల్లించలేదని విద్యా సంస్థలు సర్టిఫికెట్లు పెండింగ్ పెట్టారు. ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఆటోడ్రైవర్లు వాహనాలకు ఎఫ్‌సీలు, ఇన్స్యూరెన్స్ చేయించలేక చలానాలు కట్టుతున్నారు. అదే వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే.. ఈ పాటికి ప్రతి కుటుంబం చేతిలో సంక్షేమ పథకాల డబ్బులు ఉండేవి. ప్రతి ఇంట్లో సంతోషాలు, నవ్వులు వెల్లివిరిసేవి.



కావలి: ఐదు నెలల్లో జిల్లాలోని లక్షల మంది ప్రజల జీవన చిత్రం ఒక్కసారిగా తల్లకిందులైంది. ప్రభుత్వం మారడంతో ప్రజల ఆర్థిక సాధికారత కుప్ప కూలిపోయింది. ఆర్థిక చక్రం అష్టదిగ్బంధమైంది. రాబోయే ఐదేళ్ల తమ జీవన స్థితిగతులు ఊహించుకుంటుంటేనే వెన్నులో వణుకు పుడుతోందని పేద ప్రజలు కుమిలిపోతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లు ప్రతి నెల ప్రతి కుటుంబం ఏదోక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందుతుండేది. ఇప్పుడూ వైఎస్ జగన్ సీఎంగా ఉండి ఉంటే.. జిల్లాలో ఈ ఐదు నెలల్లో సుమారు 18 పథకాల ద్వారా రూ.1,406.04 కోట్లు ప్రజల ఖాతాల్లో జమ అయ్యేవి. ప్రభుత్వం మారడంతో ఆ డబ్బులను ప్రజలు నష్టపోయినట్లే. గత ప్రభుత్వం ఏడాది ప్రారంభంలోనే ఏ నెలలో ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందో క్యాలెండర్ ప్రకటించేది.

జిల్లాలో 20 లక్షల మంది లబ్ధిదారులు

కాయ కష్టం చేసుకుని బతికే పేదలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవాల్సిన అనివార్యత ఏర్పడింది. జిల్లాలో నెల్లూరు నగర మున్సిపల్ కార్పొరేషన్, ఐదు మున్సిపాలిటీలు, నాలుగు రెవెన్యూ డివిజన్లు, 38 మండలాలు, 722 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 32 లక్షల మంది జనాభా ఉన్నారు. ఇందులో గత ప్రభుత్వంలో దాదాపు 20 లక్షల మందికిపైగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. అర్హత ఉన్న ప్రతి మహిళకు రూ.18,750, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, నేతన్న నేస్తం, వాహనమిత్ర, మత్స్యకార భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, అమ్మఒడి, లానేస్తం, కళ్యాణమస్తు-షాదీ తోఫా, వలంటీర్లకు, పదోతరగతి విద్యార్థులకు ప్రోత్సాహాల ఇలా.. కేవలం ఏప్రిల్ నుంచి ఆగస్టు నెల వరకు దాదాపు 18 రకాల పథకాల ద్వారా రూ.1,406.04 కోట్ల అందించారు.

సూపర్ సిక్స్‌తో అసలు పథకాలకే ఎసరు

అయితే గత ప్రభుత్వం కంటే మిన్నగా సంక్షేమ పథకాలను అందిస్తామని చంద్రబాబు హామీలు గుప్పించారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో అందిస్తామని లెక్కలేసి మరీ మాయ చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున సాయం, నిరుద్యోగులకు భృతి, ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15,000, ప్రతి రైతుకు రూ.20,000 ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఆ పథకాలన్నీ నిలిపివేయడంతో జిల్లా వ్యాప్తంగా లక్షల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. స్కూళ్లు కళాశాలు తెరిచి మూడో నెల కూడా గడిచిపోతుంది. ఫీజలు చెల్లించాలని విద్యార్థులపై కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. ఆ ఫీజులు కట్టలేదని సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక స్కూల్‌తో పాటు ఇంటర్ విద్యార్థుల తల్లిదండ్రులు అమ్మఒడి డబ్బులు రాకపోవడంతో తెలిసిన వాళ్ల దగ్గర అప్పులు చేసి బిడ్డలను చేర్పించారు. మరో వైపు మత్స్యకారులు అటు వేట లేక.. ఇటు సాయం అందక ఆకలి కేకలు వేస్తున్నారు. ఇక చేనేతలు పెట్టుబడి సాయం కోసం షావుకారులను ఆశ్రయిస్తున్నారు. ఆటో డ్రైవర్లు ఇన్స్యూరెన్స్, ఎఫ్‌సీలకు సాయం అందకపోవడంతో కొందరు అప్పులు చేసి కడితే.. కొందరు కట్టలేక మిన్నకుండిపోయారు. తనిఖీల్లో చలనాలు కడుతున్నారు. ఇక రైతులైతే పెట్టుబడి సాయం అందక.. మరో వైపు తీవ్రవర్షాభావంతో సాగుపై కన్నెత్తి చూడడం లేదు. మహిళలకు వివిధ పథకాల ద్వారా వచ్చే సాయం అందకపోవడంతో ఇంటి అవసరాలకు మళ్లీ అప్పులు చేస్తున్నారు. సూపర్‌సిక్స్ పథకాల పేరుతో మోసపోయామని కొందరంటుంటే.. మరికొందరు ఓట్ల మాయ చేసి గెలిచి మా పథకాలు ఎగొట్టారంటూ మండిపడుతున్నారు.

కుప్పకూలిన వ్యాపార రంగం

జిల్లాలో వ్యాపార రంగం కుప్పకూలిపోయింది. ఐదు నెలల్లోనే ప్రజల ఆశలు ఆవిరైపోయాయి. లక్షలాది మంది పేదలకు సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందలేకపోయారు. ముఖ్యంగా పేదలు తమ చేతిలో డబ్బులు ఉంటే తమకు అవసరమైన వాటిని కొనుగోలు చేస్తూ ఉండేవారు. గడిచిన ఐదేళ్లు ఏడాదికి జిల్లా ప్రజల చేతిలో సంక్షేమ పథకాల ద్వారా సగటున రూ.6,500 నుంచి రూ.7 వేల కోట్ల టర్నోవర్ జరిగేది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు తీసుకుంటే.. ఐదు నెలల్లో 18 సంక్షేమ పథకాల ద్వారా దాదాపు రూ.1,406.04 కోట్ల అంది ఉంటే.. జిల్లాలో ఈ మొత్తం వ్యాపార లావాదేవీల రూపంలో టర్నోవర్ ఉండేది. మార్కెట్లో వస్తువులు కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆయా వస్తువుల అమ్మకాల ద్వారా పన్నులు రూపంలో నిధులు చేరేవి. అటు పేదల అవసరాలు తీరుతూ.. ఇటు ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూతుండేది. పేద, మధ్య తర గతి ప్రజల చేతిలో టర్నోవర్ ఆగిపోవడంతో దీని ప్రభావం వ్యాపారం రంగంపై పడింది.

ఏప్రిల్ — రూ.133.34 కోట్లు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి
వసతిదీవెన	43,434 మంది	రూ.46.98 కోట్లు
ఈబీసీ నేస్తం	31,706 మంది	రూ.86.36 కోట్లు

మే నెల — రూ.317.33 కోట్లు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి
రైతు భరోసా	2,44,757 మంది	రూ.134.62 కోట్లు
ఉచిత పంటల బీమా	6,587 మంది	రూ.86.35 కోట్లు
విద్యా దీవెన	37,485 మంది	రూ.34.36 కోట్లు
కల్యాణమస్తు-షాదీ తోఫా	500 మంది	రూ.4 కోట్లు
మత్స్యకార భరోసా, డీజిల్ సబ్సిడీ	19,329 మంది	రూ.58 కోట్లు

జూన్ — రూ.362.73 కోట్లు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి
అమ్మఒడి	2,41,819 మంది	రూ.362.73 కోట్లు

జూలై — రూ.232.37 కోట్లు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి
నేతన్న నేస్తం	5,131 మంది	రూ.41.90 కోట్లు
జగనన్న తోడు	44,472 మంది	రూ.2.05 కోట్లు
రైతులకు సున్నా వడ్డీ	4,63,993 మంది	రూ. 188.42 కోట్లు

ఆగస్టు — రూ.360.27 కోట్లు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి
కాపు నేస్తం	9,281 మంది	రూ.139.22 కోట్లు
వాహన మిత్ర	22,105 మంది	రూ.221.05 కోట్లు

ఇంటూరి సామంత రాజ్యం

- ఉలవపాడులో బావమరిదికి పెత్తనం
- తన వాళ్లను పెట్టుకుని దందాలు
- సోషల్ మీడియా వేదికగా సొంత పార్టీ నేతల పోస్టులు
- అధికార వర్గానికి సమాంతరంగా ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు క్యాడర్ సన్నాహాలు
- ఇంటూరి వ్యవహారంపై లోకేశ్‌కు ఫిర్యాదు చేసిన క్యాడర్



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కందుకూరు నియోజకవర్గంలో సామంత రాజ్యం నడుస్తోందని, సొంత పార్టీ క్యాడర్‌ను పక్కన పెట్టి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మండలానికో సామంతరాజును నియమించుకుని వసూలు చేసుకుంటున్న వైనాన్ని సోషల్ మీడియా గ్రూపు ద్వారా టీడీపీ నేతలు ఎండగట్టడమే కాకుండా పార్టీ నేత లోకేశ్‌కు ఫిర్యాదు చేయడంతో కందుకూరు టీడీపీలో హాట్‌టాపిక్‌గా చర్చ నడుస్తోంది. రాజకీయంగా కొత్తయినా అక్రమార్జనలో మాత్రం అందరికంటే ఆరితేరిపోయాడంటూ టీడీపీ కేడర్ బహిరంగంగానే ఆరోపణలు చేస్తోంది. రెండు నెలల్లోనే ఎమ్మెల్యే తీరుపై ఆ పార్టీ క్యాడర్ అసహ్యించుకునే స్థాయికి వెళ్లింది. ఎమ్మెల్యే వ్యవహారాలను సోషల్ మీడియా వేదికగా అది కూడా టీడీపీ వీరాభిమానులు, అమరావతి రైతులకు భారీగా విరాళాలు ఇచ్చిన నాయకులు, సీనియర్ టీడీపీ నాయకులే ఆ పోస్టింగ్‌లు పెడుతున్నారు.

అవినీతిపై బహిరంగ పోస్టులు


ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అవినీతిపై టీడీపీ నాయకులు, రాళ్లపాడు పరిరక్షణ సమితికి సంబంధించిన ఓ నాయకుడు వాట్సాప్ గ్రూప్‌లో బహిరంగంగానే విమర్శించాడు. ఈ గ్రూపులో దాదాపు 600 మందిపైన సభ్యులు ఉన్నారు. అందులో ఏకంగా ఇసుక దోపిడీ, పోర్టు నిర్మాణం, శింగరాయకొండ-ప్రొద్దుటూరు హైవే నిర్మాణం కమీషన్ల వ్యవహారం, బియ్యం మాఫియా, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో దొంగ మస్టర్లతో వసూళ్లు.. ఇలా ఒకటేమిటి అన్నింటా వసూళ్ల పర్వాన్ని ఎండగట్టారు. అందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని బహిరంగంగానే ఆ పార్టీ నేతలు గ్రూపుల్లో షేర్ చేసుకుంటున్నారు. పార్టీ కోసం పాటుపడిన వారిని వదిలి తన సొంత లాభం కోసం మండలానికి ఒక ఇన్‌చార్జిని ఏర్పాటు చేసి వసూళ్లు చేస్తున్నారని వాట్సాప్‌లో చర్చించుకోవడం గమనార్హం. ఉలవపాడు మండలంలో పార్టీ సీనియర్లను పక్కన పెట్టి తన బావమరిది సుధాకర్‌కు పెత్తనం అప్పగించారు. గ్రామస్థాయిలో పనిచేసే వీఆర్‌ఓ నుంచి నియోజకవర్గ స్థాయి అధికారి వరకు బావమరిది సిఫార్సుల మేరకే నియామకాలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. షాడో ఎమ్మెల్యేగా అవతరించిన ఆయనతో పాత నాయకులు వేగలేక పార్టీలో మరో వర్గం తయారైంది.

ఇంటూరి నుంచి కాపాడాలని కమిటీ?

కందుకూరు నియోజకవర్గాన్ని ఇంటూరి బారి నుంచి కాపాడడం, పార్టీ మేలు కోసం సలహాలు ఇవ్వడం కోసం ప్రత్యేకంగా ఒక కమిటీని కూడా ఏర్పాటు చేయడానికి క్యాడర్ లోకేశ్ దృష్టికి తీసుకెళ్లిందంటే ఆయనపై అసమ్మతి ఏ మేరకు ఉందో ఇట్టే అర్థమవుతోంది. కమిటీ పేరు కోసం కూడా 'స్కందపురి ప్రజా అభివృద్ధి సలహా కమిటీ', 'కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి సలహా కమిటీ' అంటూ పేర్లు వాట్సాప్ గ్రూపుల్లో హల్ చల్ చేస్తున్నాయి.

ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదంటూ లోకేశ్‌కు ఫిర్యాదు?

గతంలో ఎన్నడూ లేని విధంగా కందుకూరు నియోజకవర్గానికి అవినీతి మరక అంటుకుంది. గత మూడు దశాబ్దాల కాలంలో ఎమ్మెల్యేలుగా కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికైన మానుగుంట మహీధరరెడ్డి, టీడీపీ నుంచి ఎన్నికైన దివి శివరాం, వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికై టీడీపీలో చేరిన పోతుల రామారావు ఇలాంటి చెడ్డపేరు తెచ్చుకోలేదని సొంత నాయకులే అంటున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అవినీతి, అక్రమాలపై లోకేశ్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు సదరు నాయకులే సోషల్ మీడియా వేదికగా అందరికి పంచుకున్నారు.



రాళ్లపాడు పరిరక్షణ కమిటీ పేరుతో టీడీపీ నేతలు వాడుతున్న వాట్సాప్ గ్రూపులో చాటింగ్

➡ శింగరాయకొండ- ప్రొద్దుటూరు జాతీయ రహ దారి నిర్మాణంలో భాగంగా శింగరాయకొండ నుంచి మాలకొండ వరకు రూ.230 కోట్లతో 45 కి.మీ. మేర పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో పనులు సజావుగా జరిగాయి. కూటమి ప్రభుత్వం రాగానే ఆ రహదారి పనులు చేయాలంటే.. రూ.5 కోట్లు కప్పం కట్టాలని సదరు కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే డిమాండ్ చేశాడు. తాను అంత ఇవ్వలేనని చెప్పి రూ.2.50 కోట్లు ఇచ్చుకుని పనులు ప్రారంభించారు.

➡ కందుకూరు నియోజకవర్గంలో రేషన్ బియ్యం మాఫియాకు స్థానిక ప్రజాప్రతినిధి కార్యాలయం అండగా నిల్చింది. చాటు మాటుగా జరిగే రేషన్ వ్యాపారాన్ని ఎమ్మెల్యే తన అనుయాయులకు అప్పగించాడు. రేషన్ బియ్యం కొనుగోళ్లు వారే చేసి మిల్లులకు పంపాలి. అందుకు నెలవారీగా మండలానికి రూ.25 లక్షల వరకు ఇవ్వాలి.

➡ కందుకూరులో చిరుద్యోగులపై కత్తి పెట్టారు. వైన్‌షాపుల్లో పనిచేసే సేల్స్‌మెన్స్, సూపర్ వైజర్లను అనధికారికంగా తొలగించి వారి స్థానంలో తమ అనుచరులను నియమించుకున్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చేశారు. వారి ద్వారా ఉపాధి మస్టర్లు వేయించుకుని సొమ్ము కాజేస్తున్నారు. అగ్రికల్చర్ మార్కెట్‌లో చిరుద్యోగులు, మున్సిపల్ కార్యాలయంలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులను తొలగించి వారి స్థానంలో తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటున్నారు.

ఈ ఆరోపణలు చేసింది సాక్షాత్తూ రాళ్లపాడు పరిరక్షణ కమిటీ పేరుతో వాట్సాప్ గ్రూపు నిర్వహిస్తున్న టీడీపీ వీరాభిమానులే. ఆ గ్రూపులో చాటింగ్ ద్వారా అన్ని రంగాలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అవినీతిమయం చేసి అక్రమార్జన చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పరిశ్రమలకు వేగంగా అనుమతులివ్వాలి

- భూసేకరణ, నీటివసతి, విద్యుత్ సదుపాయాలు కల్పించండి
- పక్కాగా క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అమలు
- పీఎంఈజీపీ, పీఎం సూర్య ఘర్ యోజన విరివిగా అందించండి
- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, హాజరైన అధికారులు

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో పరిశ్రమలు స్థాపించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. తొలుత గతంలో తీసుకున్న చర్యలను పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటవుతున్న భారీ పరిశ్రమలకు అన్ని అనుమతులు, భూసేకరణ, నీటి వసతి, విద్యుత్ మొదలైన సదుపాయాలు వేగంగా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు వస్తున్న దరఖాస్తులను నిబంధనల మేరకు ఆమోదించాలన్నారు. దరఖాస్తులను ఎందుకు తిరస్కరిస్తున్నారో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తెలపడం, నిర్దిష్ట గడువులోగా సమస్యలను పరిష్కరించి మళ్లీ వారితో దరఖాస్తులు పెట్టించాలని సూచించారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఎన్ని యూనిట్లు పని చేస్తున్నాయి, అవి ఇళ్లలో ఉన్నాయా, దుకాణాల్లో ఉన్నాయా ఎంత మంది పని చేస్తున్నారు అనే వివరాలు సేకరిస్తూ సర్వే చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో వారు వ్యాపారాన్ని మరింత వృద్ధి చేసుకునేందుకు సహకరించాలన్నారు. ఇళ్లలో యూనిట్లు నిర్వహిస్తున్న కుటీర పరిశ్రమలకు 300 యూనిట్ల వరకు ఏపీఎస్‌పీడీసీఎల్ ద్వారా ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం అందించాలని సూచించారు. యూనిట్ల విస్తరణ, కొత్త యూనిట్ స్థాపనకు పీఎంఈజీపీ పథకాన్ని బ్యాంకర్లతో మాట్లాడి అందించాలని సూచించారు. రెడీమేడ్ గోల్డ్, ఆఫ్‌సెట్, వెట్ ప్రింటింగ్, నోట్ బుక్ తయారీ లబ్ధిదారులను ఎంపిక చేసి ఖాదీ విలేజ్ ఇండస్ట్రియల్ బోర్డు, జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జీఎం సుధాకర్, ఏపీఐఐసీ జెడ్‌ఎం విజయరత్నం, డీపీఓ సుస్మిత, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్, సోమశిల, కండలేరు ప్రాజెక్టుల ఎస్‌ఈలు ఎంవీ రమణారెడ్డి, బీవీ రమణారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్, ఉపకార్మిక అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు

నెల్లూరు (టౌన్): విధుల్లో అలసత్వం, విద్యార్థులకు సరిగా బోధించకపోవడం తదితర కారణాలతో ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు ఉత్తర్వులు మంగళవారం జారీ చేశారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని జెడ్పీ హైస్కూల్ పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఆర్‌వీ ప్రసన్నలక్ష్మి, తెలుగు పండిట్ ఎల్.శ్రీనివాసరావుపై ఆ పాఠశాల ఇటీవల విద్యార్థులు కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వారి పనితీరుపై క్షేత్ర స్థాయిలో విచారించి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను విచా రించి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. విద్యార్థులు చేసిన ఆరోపణలు, ఫిర్యాదులు నిజమని తేలడంతో ఆ ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వారిని సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

పోలీస్ శాఖకు మూడు బొలెరో వాహనాలు



నెల్లూరు(క్రైమ్): సీఎస్సార్ ద్వారా పోలీస్ శాఖకు రూ.28 లక్షల విలువజేసే మూడు బొలెరో వాహనాలను అందజేసేందుకు జీఈఎఫ్ సంస్థ ముందుకొచ్చింది. ఈ క్రమంలో వీటి తాళాలను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఎస్పీ కృష్ణకాంత్‌కు సంస్థ ప్రతినిధులు మంగళవారం అందజేశారు. నగరంలోని పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జీఈఎఫ్ సంస్థ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, ఏజీఎం పంపావతి, ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు, కావలి డీఎస్పీ వెంకటరమణ, ఎమ్టీ ఆర్ఐ అంకమరావు, డీటీసీ ఆర్ఐ థామస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని హేచరీలపై చర్యలు



తనిఖీ చేస్తున్న నాగేశ్వరరావు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో అనుమతి లేకుండా చేపలు, రొయ్యలకు సంబంధించిన హేచరీలు, ఐస్ ప్లాంట్లు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఆక్వా షాపులను నిర్వహిస్తే చర్యలు తప్పవని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు హెచ్చరించారు. నగరంలోని రాజశేఖర్ ఆక్వా దుకాణాన్ని ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆక్వా రంగ అభివృద్ధి, సుస్థిరత, క్రమబద్ధీకరణ కోసం ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. మందులు, ప్రొబయోటిక్స్, కెమికల్స్ తదితర ఉత్పత్తులు, విక్రయాలకు సంబంధించిన లైసెన్స్‌లను విధిగా పొందాలని చెప్పారు. లైసెన్స్‌లు పొందాలని తమ శాఖ పలుమార్లు నోటీసులను జారీ చేసినా, కొంత మంది నేటికీ తీసుకోలేదని చెప్పారు. వీరు తక్షణమే అనుమతులను పొందాలని ఆదేశించారు.

జిల్లాలో తొలి విద్యుత్ స్మార్ట్ మీటర్ ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో తొలి విద్యుత్ స్మార్ట్ మీటర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ విజయన్ మాట్లాడారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తొలి మీటర్‌ను కొత్తూరులో ఉన్న తెలుగుగంగ ఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేశామని వివరించారు. విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ విభాగ ఈఈ శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రభాకర్, కృష్ణారెడ్డి, అశోక్, సురేష్, అసిస్టెంట్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ, పెంచలప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరస్తు.. కల్యాణమస్తు

మొదలైన పెళ్లి సందడి



వివాహం.. ప్రతి ఒక్కరి జీవితంలో మధురానుభూతి. తమ పిల్లల వివాహాలను అత్యంత వేడుకగా జరిపించాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. ఈ క్రమంలో కొన్ని సందర్భాల్లో సుముహూర్తాల్లేక నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. అయితే ఈ ఏడాదిలో ఈ నెల నుంచి డిసెంబర్ వరకు సెప్టెంబర్ మినహా మంచి ముహూర్తాలు చాలా ఉన్నాయి. దీంతో జిల్లాలో పెళ్లి సందడి నెలకొంది. కల్యాణ మండపాలకు డిమాండ్ పెరగ్గా.. పురోహితులు బిజీబిజీగా ఉండనున్నారు.

- డిసెంబర్ వరకు సుముహూర్తాలు
- సెప్టెంబర్ మినహా ప్రతి నెలా కోలాహలమే
- అక్టోబర్‌లో అధికంగా
- కల్యాణ మండపాలకు డిమాండ్

డ్రోన్ ఫొటోగ్రఫీపై మక్కువ



పెళ్లిళ్లలో ఫొటోలు, వీడియోలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ప్రస్తుత కాలంలో ఫొటోగ్రఫీ కొత్తపుంతలు తొక్కుతోంది. డ్రోన్ ఫొటోగ్రఫీపై మక్కువ రానురాను అధికమవుతోంది. జిల్లాలో డ్రోన్‌తో ఫొటోలు, వీడియోలు తీసేందుకు గానూ ఒక్కో కార్యక్రమానికి రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారంటేనే దీనికి ఉన్న క్రేజ్ ఏమిటో అర్థం చేసుకోవచ్చు. దీనికి ప్రింటింగ్, మిక్సింగ్ ఖర్చులు అదనం.

నెల్లూరు(బారకాసు): శ్రావణమాసం వస్తూ.. వస్తూ.. సుముహూర్తాలను వెంటబెట్టుకొచ్చింది. ఫలితంగా జిల్లాలో పెళ్లి సందడి మొదలైంది. ఈ హడావుడి డిసెంబర్ వరకు కొనసాగనుంది. దీంతో పెళ్లి పనులను చాలా ఇళ్లలో మొదలెట్టేశారు.

భారీగా వివాహాలు..

పెళ్లిళ్లు ఎక్కువగా జరగనుండటంతో కల్యాణ మండపాలూ బుక్కైపోయాయి. సెప్టెంబర్ మినహా ఆగస్ట్ నుంచి డిసెంబర్ వరకు జిల్లాలో సుమారు ఐదారువేలకుపైగా వివాహాలు జరగనున్నాయని అంచనా. దీంతో అనుబంధ వ్యాపారాలూ ఊపందుకున్నాయి. మరోవైపు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో వివాహాలు జరగనుండటంతో దేవదాయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

అధునాతన సెట్టింగులతో సిద్ధం

కళ్లు చెదిరే సెట్టింగులతో కల్యాణ మండపాలు సిద్ధమయ్యాయి. రూ.లక్షల్లో అద్దె పలుకుతున్నా.. అక్కడ వివాహాలు చేస్తే ఆ తీరే వేరని తల్లిదండ్రులు భావిస్తున్నారు. స్తోమతకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల్లో మండపాల ఆకర్షణ.. లైటింగ్.. డెకరేషన్ తదితర అంశాల ఆధారంగా అద్దె ధరలుంటాయి.

మంగళవాయిద్యాలకు గిరాకీ..

హిందూ సంప్రదాయంలో భాజాభజంత్రీలు లేనిదే పెళ్లిళ్లు జరగవు. అందుకే మంగళవాయిద్యాలకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. వధూవరులను సిద్ధం చేయడం మొదలుకొని.. వివాహానంతరం వారిని ఇంటికి తీసుకొచ్చేంత వరకు వాయిద్యాల అవసరం ఉంటుంది. జిల్లాలోని బ్యాండ్ మేళం గ్రూపులు ఒక్కో కార్యక్రమానికి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నాయి. పెళ్లిళ్లలో కొందరు సంగీత విభావరులను నిర్వహిస్తుంటారు. దీనికి రూ.50 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు తీసుకుంటున్నారు.

సుముహూర్తాలివే..

- శ్రావణమాసం ప్రారంభం కావడంతో శుభ ముహూర్తాలు మొదలయ్యాయి. ఈ నెల 8వ నుంచి మొదటి ముహూర్తం ప్రారంభమైంది. దీంతో జిల్లాలో పెళ్లి సందడి నెలకొంది. అలాగే 9, 11, 14, 16, 18, 22, 23, 24, 28 వరకు వివాహానికి మంచి రోజులు.
- భాద్రపద మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో సెప్టెంబర్‌లో శుభకార్యాల్లేవు.
- అక్టోబర్ మూడు నుంచి ఆశ్వయుజమాసం ప్రారంభంకానుంది. ఇదే నెల్లో నవరాత్రులూ ప్రారంభంకానున్నాయి.



అక్టోబర్‌లో..
4, 5, 6, తొమ్మిది నుంచి 13 వరకు.. 16, 17, 20, 23, 24, 25, 27 వరకు.

నవంబర్‌లో..
3, 6, 7, 8, 9, 10, 13, 14, 16, 17, 20, 21, 24 వరకు.

డిసెంబర్‌లో..
4, 5, 6, 7, 8, 11, 12, 14, 15, 18, 20, 22, 25వ తేదీల్లో శుభముహూర్తాలున్నాయి.



ముస్తాబైన కల్యాణ వేదిక

వివాహ భోజనంబు.. వింతైన వంటకంబు



విందు లేనిదే పెళ్లి ఉండదు. భోజనాలు రుచిగా ఉండాలని.. బంధుమిత్రుల్లో మాట రాకూడదని అధిక శాతం మంది భావిస్తారు. అందుకే ఎంత ఖర్చయినా వెనుకాడరు. ఉదయం టిఫిన్ మొదలుకొని రాత్రి భోజనం వరకు.. ఇలా పెళ్లి తంతు పూర్తయ్యేంత వరకు భోజనాన్ని సరఫరా చేసే క్యాటరింగ్ సంస్థలు జిల్లాలో చాలానే ఉన్నాయి. మెనూ ప్రకారం ధరను వసూలు చేస్తాయి. ఎంచుకున్న పదార్థాలను బట్టి ప్లేట్ ధర రూ.100 నుంచి అందుబాటులో ఉంది.

అక్టోబర్‌లోనే అత్యధికం



శ్రావణ మాసం రాకతో సుముహూర్తాలొచ్చాయి. ఆగస్టులో 10 రోజులు.. అక్టోబర్‌లో 15 రోజుల పాటు మంచి ముహూర్తాలు ఉన్నాయి. నవంబర్, డిసెంబర్‌లోనూ ఇదే పరిస్థితి.

– సత్యనారాయణమూర్తి, పురోహితుడు

మాతాశిశు మరణాలను తగ్గించేందుకు చర్యలు

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): మాతాశిశు మరణాలను తగ్గించేందుకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. మాతాశిశు మరణాలపై కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ ఏడాదిలో జిల్లాలో సంభవించిన ఆరు మరణాలపై సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. హైరిస్క్ గల కేసులను ముందుగానే గుర్తించి జీజీహెచ్ లాంటి పెద్దాస్పత్రులకు తరలించాలని సూచించారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలోనే పేషెంట్ వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. మాతాశిశు మరణాలు సంభవిస్తే, వారి కుటుంబసభ్యులకు అవగాహన కల్పించి పోస్ట్‌మార్టాన్ని తప్పక చేయించేందుకు కృషి చేయాలని సూచించారు. రక్త నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని, అవసరమైతే రెడ్‌క్రాస్ సంస్థతో మాట్లాడి ప్రతి నెలా రక్త సేకరణకు క్యాంపులను నిర్వహించాలని చెప్పారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పంట కోత ప్రయోగాలు

- వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి



పంట కోత ప్రయోగాలపై శిక్షణ నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు (దర్గామిట్ట): పంట కోత ప్రయోగాలను పక్కాగా నిర్వహించి కచ్చితమైన దిగుబడులను నమోదు చేయాలని వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి సూచించారు. కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో పంట కోత ప్రయోగాలపై మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 2024 ఖరీఫ్ కాలానికి సంబంధించి సీసీఈ యాప్ ద్వారా పంట కోత ప్రయోగాలను జరపాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.

అనంతరం సీపీఓ సాల్మాన్‌రాజు మాట్లాడారు. పంట కోత ప్రయోగాల ద్వారా వచ్చే దిగుబడి ఆధారంగా, ప్రకృతి వైపరీత్యాల్లో పంట దెబ్బతింటే రైతులకు నష్ట పరిహారాన్ని అందజేస్తామని వెల్లడించారు. పంట కోత ప్రయోగాలను నిర్వహించాల్సిన పద్ధతిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీపీఓ కార్యాలయ సంచాలకుడు లక్ష్మీనరసింహులు, గణాంకాధికారి శ్యామ్‌కుమార్ అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ ఏడీలు శేషగిరి, నర్సోజీరావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని ఉపేక్షించబోం

ఉదయగిరి: ఉపాధి హామీ పనుల్లో అవినీతి జరిగితే కఠిన చర్యలు తప్పవని, పనులు పారదర్శకంగా నిర్వహించి కూలీలకు గరిష్ఠ వేతనం అందేలా చర్యలు చేపట్టాలని డ్వామా ఇన్‌చార్జి పీడీ బలసాని శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని స్త్రీ శక్తి భవనంలో ఉదయగిరి నియోజకవర్గ ఏపీఓలు, ఈసీలు, టీఏలు, క్షేత్ర సహాయకులతో మంగళవారం నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీల సంఖ్యను పెంచి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఏపీడీ గాయత్రీదేవి, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఏపీఓలు శ్రీనివాసులు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :	రూ.120
సన్నవి :	రూ.80
పండ్లు :	రూ.60

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్:	రూ.123
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.222
స్కిన్‌లెస్ చికెన్:	రూ.244
లేయర్ చికెన్:	రూ.178

హనుమంత వాహనంపై వెంకయ్యస్వామి విహారం



వెంకటాచలం: గొలగమూడిలో నిర్వహిస్తున్న వెంకయ్యస్వామి 42వ ఆరాధనోత్సవాల్లో భాగంగా హనుమంత వాహనసేవను మంగళవారం నిర్వహించారు. వాహనంపై వెంకయ్య స్వామిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం సాగింది. ఆశ్రమంలోని నిత్యాన్నదాన శాలలో అన్నదానాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా ఇందుకూరుపేటకు చెందిన సూదలగుంట నాగార్జునరావు, ప్రేమలత దంపతులు వ్యవహరించారు. ఏర్పాట్లను ఈఓ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

- హంసవాహనసేవను నేత్రపర్వంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో గొలగమూడిలోని వీధులు కిక్కిరిసిపోయాయి. ఉభయకర్తలుగా మోచర్ల మధు, ఉప్పల మోహన్, గాంధీ వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.
- ఆరాధనోత్సవాల్లో భాగంగా చినశేష వాహన, గజవాహన సేవలను బుధవారం నిర్వహించనున్నారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు

- పది మంది అరెస్ట్
- ఆరు ట్రాక్టర్ల స్వాధీనం

నెల్లూరు సిటీ: ములుమూడి సమీపంలోని పెన్నా వద్ద ఇసుకను కొందరు అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. దీనిపై రూరల్ పోలీసులకు సోమవారం రాత్రి సమాచారం అందింది. దీంతో పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకొని విచారించారు. అక్రమ రవాణా చేస్తున్నారని నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఆరు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఆరుగురు డ్రైవర్లు, నలుగురు యజమానులను అదుపులోకి తీసుకున్నారు. అక్రమ రవాణాపై కేసు నమోదు చేశారు.



ఏమైనా ఈవెంట్ అనుకుంటే పొరపాటే..!



ఈ టార్పాలిన్ పట్టలను గమనించి, ఇదేదో కార్యక్రమాన్ని నిర్వహించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశారనుకుంటే పొరపాటే. నగరంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని నిర్మించి ఏళ్లు గడుస్తుండటంతో అది శిథిలావస్థకు చేరుకొని వర్షమొచ్చిన సందర్భాల్లో ఉరుస్తోంది. ఈ సమస్య నుంచి తాత్కాలిక ఉపశమనం కోసం ఇలా పట్టలను ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

మమ్మల్ని గుర్తించండి మహాప్రభో..

- నామినేటెడ్ పదవుల కోసం పోటీ
- విజయమే పరమావధిగా నాడు అందరికీ హామీ
- ఎమ్మెల్యే కాకర్లకు తలనొప్పిగా మారిన వ్యవహారం
- బయోడేటాలతో నేతల విన్నపాలు



అధికారాన్ని చేజిక్కించుకొని పట్టుమని రెండున్నర నెలలు కాక ముందే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు తలనొప్పి స్టార్టయింది. నామినేటెడ్ పదవుల కోసం పోటీ పెరుగుతుండటం.. తమ బయోడేటాలతో నేతలు విన్నపాలను ప్రారంభించడంతో ఏమి చేయాలో పాలుపోక అయోమయ స్థితిలో ఆయన కొట్టామిట్టాడుతున్నారు.

ఉదయగిరి: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం నాటి అన్ని నామినేటెడ్ పోస్టులను సీఎం చంద్రబాబు రద్దు చేశారు. త్వరలోనే పోస్టులను భర్తీ చేసేందుకు కసరత్తు ప్రారంభమైంది. దీంతో ఉదయగిరి నియోజకవర్గంలో వీటిని దక్కించుకునేందుకు పోటీ తీవ్రమైంది.

ఆశావహుల క్యూ

గత సార్వత్రిక ఎన్నికల వేళ పలువురి మద్దతు పొందేందుకు గానూ నామినేటెడ్ పదవుల ఆశను కాకర్ల సురేష్ చూపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతల మద్దతు కోరి వారికి ఈ ఆశ చూపి పార్టీలో చేర్చుకున్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో పదవుల కోసం ఎమ్మెల్యే వద్దకు అనేక మంది క్యూ కడుతున్నారు. ఇదే ఫార్ములాను సైతం చంద్రబాబు, లోకేశ్ అవలంబించారు. దీంతో అనేక మంది పార్టీ అధినేతతో పాటు యువనేతను కలిసి తమ పేర్లను పరిశీలించాలని కోరుతూ బయోడేటాలను అందజేస్తున్నారు.

ఇదండీ జరుగుతోంది..!

- ఎన్నికలకు ముందు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిని చంద్రబాబు పిలిపించి.. నియోజకవర్గంలో పార్టీ విజయం సాధిస్తే కీలక పదవిని ఇస్తామని చెప్పారు. ఇదే హామీని కాకర్ల సురేష్ సైతం ఇచ్చారు. దీంతో పార్టీ విజయం కోసం తీవ్రంగా శ్రమించారు. ప్రస్తుతం ఉదయగిరి ఏఎంసీ చైర్మన్ పదవిని తన కుమారుడికి ఇవ్వాలని కోరుతున్నారు. అయితే వింజమూరుకు చెందిన గణపం సుదర్శన్‌రెడ్డికి ఇచ్చేందుకు కాకర్ల సురేష్ మొగ్గ చూపుతున్నారని తెలుస్తోంది.
- మాజీ ఎమ్మెల్యే చెంచురామయ్య వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన చెంచల బాబుయాదవ్ ఉదయగిరి అసెంబ్లీ సీటును ఇవ్వాలని గత ఎన్నికల వేళ డిమాండ్ చేశారు. అయితే అది ఫలించలేదు. పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర స్థాయిలో కీలక పోస్టు ఇస్తామని యువనేత హామీ ఇచ్చారు. దీంతో బీసీ కోటాలో తనకు నామినేటెడ్ పదవివ్వాలని ఆయన విన్నవించారు. ఇది నెరవేరుతుందో లేదో వేచి చూడాల్సిందే.
- ఉదయగిరి నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రంలో తనకంటూ ఒక ఇమేజ్ సంపాదించుకొని నాలుగుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికలకు ముందు అనుహ్యంగా టీడీపీలో చేరారు. పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం రాలేదు. తనతో పాటు సతీమణి శాంతకుమారికి నామినేటెడ్ పదవి కోసం యత్నాలు సాగిస్తున్నారు.
- సార్వత్రిక ఎన్నికల వేళ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరి పార్టీ విజయానికి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తీవ్రంగా కష్టించారు. జలదంకి మండలంలో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించి కాకర్ల విజయంలో కీలకంగా మారారు. గతంలో ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఈయన బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పుడు ఏదో ఒక కార్పొరేషన్ పదవి కోసం పట్టుబడుతున్నారు.
- గతంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన మెట్టుకూరు చిరంజీవి రెడ్డి.. ఉదయగిరి మండలానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి.. వరికుంటపాడు మండలానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ చంద్ర మధుసూదనరావు.. వింజమూరు మండలానికి చెందిన జూపల్లి రాజారావు సైతం పదవులను ఆశిస్తున్నారు. పోటీ తీవ్రంగా ఉండటంతో నామినేటెడ్ పదవుల పందేరం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు తలనొప్పిగా మారిందనే అంశం తేటతెల్లమవుతోంది.